RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:26 THURSDAY ,MAY 28,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :26 గురువారం, మే 28, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు

# పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి...నిర్లక్ష్యానికి తావులేదు
- సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి..
- ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి..
- వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి..
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి..
- గురుకుల స్వంత భవనాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలి..
- గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..



2

## అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

# కేటీఆర్‌కు పొంగులేటి సవాల్



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. - మిగతా2లో

# బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పశ్చిమబెంగాల్‌లో సుదీర్ఘ పాలనకు తెరపడటంతో చిక్కుల్లో పడిన మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరిన్ని చిక్కులు తప్పలే కనిపించడం లేదు. ఆ పార్టీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నట్టు బీజేపీ ఎంపీ సౌమిత్రా ఖాన్ తాజాగా బాంబు పేల్చారు. - మిగతా2లో





# ప్రధానమంత్రి మోదీని కలిసిన సీఎం విజయ్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. చోళుల కాలం నాటి రాగి శాసననాలకు పోలెండ్ నుంచి భారత దేశానికి రప్పించినందుకు మోదీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక ప్రకటించిన మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలపై దాని ప్రభావాన్ని విజయ్ ప్రధాని దృష్టికి వెళ్లారు. - మిగతా2లో




## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

## కూకట్‌పల్లి డీసీపీ పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపి, మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా... న్యాయస్థానం మూడు రోజుల - మిగతా2లో



# రాజ్యసభకు సిద్దరామయ్య

# సీఎంగా డీకే శివకుమార్



2

- కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత
- హైకమాండ్ నిర్ణయంమేరకు రేపు సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా

# రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూ భారతిలో ఎలా మారింది?

తెలంగాణ పత్రిక ప్రతినిధి

శంషాబాద్‌లో రూ.1000 కోట్ల భూ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అధికార కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుస స్కామ్ లు జరుగుతున్నాయంటూ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకు ఆయన శంషాబాద్‌లో - మిగతా2లో



# రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

-మొదటిపేజీ తరువాయి

రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్య పై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ సంబంధిత అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభకు సిద్దరామయ్య సీఎంగా డీకే శివకుమార్

-మొదటిపేజీ తరువాయి

కర్ణాటకలో సీఎం మార్పుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.సిద్దరామయ్య రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం కానున్నారన్న ప్రచారం జోరందుకుంది.

**హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు సీఎంపదవికి సిద్దరామయ్య రాజీనామా**

కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో,ప్రభుత్వంలో కీలక మార్పులకు కారణమవుతుంది. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం మేరకు రేపు ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయనున్నట్లుగా సమాచారం. ఆయనను రాజ్యసభకు రావాలని హైకమాండ్ సూచించిందని కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారని కాంగ్రెస్ వర్గాల కథనం. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు పై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ డీకే శివకుమార్, సిద్ధరామయ్యతో రోజంతా చర్చలు జరిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలాతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు కర్ణాటక కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023లో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీలో భాగంగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చి తీరాలని అగ్రనేతల ముందు డీకే శివకుమార్ మరోసారి తన వాదన వినిపించారు. ప్రతిగా సిద్ధరామయ్య తను సీఎంపదవివదులుకోవాల్సి వస్తే ఎస్సీ వర్గానికి చెంది పరమేశ్వర్ ను సీఎం చేయాలని మెలిక పెట్టారు. అయితే అన్ని వర్గాల వాదనలపై భేటీలో సుదీర్ఘ చర్చ అనంతరం కర్ణాటక సీఎం మార్పుపైన, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైన కాంగ్రెస్ హైకమాండ్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు ఆ సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది.అధిష్టానం నిర్ణయం నేపథ్యంలో రేపు బెంగుళూరులో కేబినెట్ మీటింగ్ తర్వాత సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నారు గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులో ని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.నూతన సీఎం డీకే శివకుమార్ సారధ్యంలోని కేబినెట్ లో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య ను రాజ్యసభ కు ఎంపిక చేయడం ద్వారా ఆయన సేవలు దేశవ్యాప్తం గా పార్టీ కోసం ఉపయోగిం కుంటా మని రాహుల్ గాంధీ భరోసా ని చ్చినట్లుగా తెలుస్తుంది.

# రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది

-మొదటిపేజీ తరువాయి

శంషాబాద్ పరిధిలోని పెద్దషాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 172 నుండి 180 లో ఉన్న 94.73 ఎకరాల ప్రభుత్వ భూమి వివాదంలో తగిన నిర్ణయం తీసుకోవాలని 30--01--2026 నాడు హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఈ భూమిని నిషేధిత జాబితాలో పెట్టాలని, అక్రమార్కుల నుండి కాపాడాలని 24--2--2026 నాడు ఆర్డీవో తహశీల్ధార్ కు ఆర్డర్ జారీ చేశాడని, అదే విధంగా హైకోర్టులో కూడా అఫిడవిట్ వేశాడని హరీశ్ రావు తెలిపారు. కానీ 28--02--2026 నాడు తహశీల్ధార్ ఆ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా ఆర్డర్ పాస్ చేసి, హైకోర్టుకు కూడా ప్రైవేట్ వ్యక్తుల భూమి అని తెలిపాడని వెల్లడించారు. ఒకే భూమిని ఆర్డీవో ప్రభుత్వ భూమి అంటాడు, తహశీల్ధార్ ప్రైవేట్ భూమి అంటాడని, అసలు కలెక్టర్ అప్రూవల్ లేకుండా ఆర్డీవో, తహశీల్ధార్ భూమి గురించి హైకోర్టులో పిటిషన్ ఎలా వేసారు? అని హరీశ్ రావు నిలదీశారు. ఈ భూస్కామ్ వెనుక రేవంత్ రెడ్డి, అతని ముఖ్య అనుచరుడైన ఓ కార్పొరేషన్ చైర్మన్ , ఒక మంత్రి ఉన్నారని ఆరోపించారు. ఈ సర్వే నెంబర్ లోని 94.73 ఎకరాలతో పాటు మరో 176 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఫైల్ సిద్ధమైనట్లు సమాచారం ఉందని, మొత్తం 270 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి దాదాపు రూ.1,000 కోట్ల కుంభకోణానికి సొసైటీ వైస్ చైర్మన్ తెరలేపారని, ఈ అంశం వివాదాస్పదం అవ్వడంతో తహశీల్దార్‌ను పిలిపించి తను ఇచ్చిన ఉత్తర్వులు గురించి ఏసీబీ విచారణ సైతం చేపట్టిందని తెలిపారు. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా భూభారతిలో ఎలా మారింది? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తహశీల్ధార్ ఆదేశాల మేరకు ఆ భూమిని భూ భారతిలో ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద బదిలీ కూడా చేశారు అని, 24--05--2026 తేదీన ప్రైవేట్ వ్యక్తుల పేరిట మొత్తం 170 ఎకరాలను భూ భారతిలో ఎక్కించారు అని తెలిపారు.చట్ట ప్రకారం ఆర్డీవో దరఖాస్తు చేసుకుని, నిర్ణీత సమయంలో ఆర్డీవో నిర్ణయం తీసుకోవాలని, కానీ ఇక్కడ ఆర్డీవో ప్రమేయం లేకుండా తహశీల్ధార్ నిర్ణయం తీసుకున్నాడన్నారు. ఇదంతా బయటపడగానే గుట్టుచప్పుడు కాకుండా తహశీల్ధార్ ను సస్పెండ్ చేశారన్నారు. ఈ ప్రైవేట్ వ్యక్తుల జాబితాలో మంత్రుల కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఉన్నాయని హరీశ్ రావు వెల్లడించారు.

## అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

# కేటీఆర్‌కు పొంగులేటి సవాల్

-మొదటిపేజీ తరువాయి

మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించానా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు.

## ప్రధానమంత్రి మోదీని కలిసిన సీఎం విజయ్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర గీతం పాడేందుకు అనుమతిం చాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయ్ నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్–విజయ్ పోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

## బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు, 50 మంది ఎమ్మెల్యేలు

-మొదటిపేజీ తరువాయి

బుధవారం నాడిక్కడ మీడియాతో సౌమిత్రా ఖాన్ మాట్లాడుతూ, టీఎంసీ ఎంపీలు ఆ పార్టీలో కొనసాగే విషయంలో సంతోషంగా లేరని, బీజేపీ నేతలతో సంప్రదింపులు సాగిస్తున్నారని చెప్పారు. '20 మంది నేతలు మాతో టచ్‌లో ఉన్నారు. పార్టీ నాయకత్వం కోరుకుంటే వాళ్లంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో టీఎంసీ మొత్తం ఖాళీ అవుతుంది' అని అన్నారు. అయితే బీజేపీతో సంప్రదింపులు సాగిస్తున్న టీఎంసీ ఎంపీల పేర్లను సౌమిత్రా ఖాన్ వెల్లడించలేదు. పశ్చిమబెంగాల్ నుంచి మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో టీఎంసీకి ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. బీజేపీకి 12, కాంగ్రెస్‌కు ఒక ఎంపీ ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఒక పార్లమెంటరీ పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది పార్టీ మారాలనుకుంటే వారిపై అనర్హత వేటు పడదు. టీఎంసీ విషయానికి వస్తే టీఎంసీకి 29 మంది ఎంపీలు ఉన్నందుకు 19 నుంచి 20 మంది ఎంపీలు పార్టీ మారితే అనర్హత వేటు నుంచి వారు తప్పించుకునే వీలుంది.

## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందుగా నిందితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, భారీ భద్రత నడుమ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణ ప్రక్రియ అంతా కూకట్‌పల్లి డీసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరగుతోంది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు మరిన్ని సెక్షన్లను చేర్చిన నేపథ్యంలో, ఈ మూడు రోజుల కస్టడీ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.

# హైదరాబాద్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన భూములకు విముక్తి

తెలంగాణ పత్రిక ప్రతినిధి

హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ఐటీ కారిడార్, కోకాపేట పరిసరాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపింది. మార్కెట్‌లో ఎకరం రూ.150 కోట్లకు పైగా పలికే ఈ ప్రాంతాల్లో బడా రియల్టర్లు పక్కా ప్రణాళికతో సాగిస్తున్న భూదందాకు అడ్డుకట్ట వేసింది. నిన్న నగరం నలువైపులా ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించి, సుమారు రూ.4,117 కోట్ల విలువైన ప్రభుత్వ, చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలను తొలగించి, ఆ భూముల చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేసింది.

**కోకాపేటలో బట్టబయలైన బడా సంస్థల అక్రమాలు**

ఈ ఆపరేషన్‌లో భాగంగా కోకాపేటలో ప్రముఖ స్థిరాస్తి సంస్థలు సాగిస్తున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తచెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోని 1.09 ఎకరాల భూమిని ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించుకుంది. 'గోల్డ్‌ఫిష్ కాలనీ' పేరుతో అక్కడ విల్లాలను నిర్మించడమే కాకుండా మిగిలిన చెరువు భాగాన్ని మట్టితో పూడ్చివేసి నివాసితుల కోసం లగ్జరీ గార్డెన్లు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు నిర్మించింది. స్థానికులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన హైడ్రా అధికారులు, అది చెరువు భూమి అని నిర్ధారించుకుని అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఇదే ప్రాంతంలోని పెద్దచెరువు పరిధిలో బహుళ అంతస్తుల భవనాల కోసం ఆక్రమించిన సుమారు 22 ఎకరాల స్థలాన్ని కూడా అధికారులు కాపాడారు. ఒక్క కోకాపేటలోనే స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

**మ్యాప్ నుంచే చెరువును మాయం చేసే కుట్ర భగ్నం**

మరోవైపు శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును ఏకంగా మ్యాప్ నుంచే తొలగించేందుకు జరిగిన భారీ కుట్రను హైడ్రా భగ్నం చేసింది. తమ్మిడికుంట చెరువు నిండినప్పుడు వచ్చే వరద నీటి కాలువను కబ్జాదారులు దారి మళ్లించి, చెరువు ఎండిపోయేలా చేశారు. ఆ తర్వాత ఆ స్థలంలో భారీ ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు కూడా విచారణలో ఉంది. హైడ్రా అధికారులు శాటిలైట్ చిత్రాలు, పాత ఎఫ్‌టీఎల్ రికార్డుల ఆధారంగా 6.50 ఎకరాల చెరువు స్థలాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.600 కోట్లు. దీనికి ఆనుకుని ఉన్న రూ.500 కోట్ల విలువైన 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా అధికారులు కాపాడారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

-రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య



పెద్దపల్లి, ప్రతినిధి మే 27 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలో నిర్వహించు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని రెవిన్యూ డివిజనల్ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్దం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల వేదిక , కూర్చోవడానికి ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, ఆర్ డబీ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల వద్ద ఏ.ఎన్.ఏం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర త్రాగు నీటి సరఫరా పనులు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని ఆర్డిఓ తెలిపారు. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. పెద్దపల్లి పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మాఅధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యఅతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా మే 29 సాయంత్రం నాటికి అందజేయాలని అన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏ సి పి.జి. కృష్ణ ,కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ సి విభాగం సూపరింటెండెంట్ కుమారస్వామి, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ తాసిల్దార్ రాజయ్య, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో మహిళా చట్టాల పై అవగాహన కార్యక్రమం



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 27

శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో ఈరోజు పోస్ ఆక్ట్ గురించి వివరించడం జరిగింది.కిశోర బాలికలకు మహిళలకు చట్టం గురించి వివరించి,టోల్ ఫ్రీ నెంబర్ 1098,108,100 ఫోన్ నెంబర్ల గురించి వివరించారు. ఇందులో ముఖ్య ఉద్దేశం చైల్డ్ మ్యారేజ్ చేసుకోవద్దు బాల్య వివాహాలు బ్రతుకు ఆగం అంటూ బాల్య వివాహం నిర్మూలించుటకు మన వంతు కృషి చేయాలని. బాల్య వివాహం చేసుకుంటే పిల్లల పై శారీరక మానసికప్రభావం పడుతుందని చిన్నపిల్లలు ఎలాంటి చెడు అలవాట్లకు గురికాకుండా ఉండాలని మంచి సమతుల్య ఆహారము తీసుకోవాలని డాక్టర్ సంజయ్ కుమార్, స్టాఫ్ నర్స్ రాజమణి,అంగన్వాడీ టీచర్స్ వనిత, వసంత, రజిత, మంజుల, జయ ఆశా వర్కర్, కిషోర బాలికలు,తల్లులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో వేగం పెంచాలి

-వాహనాలు, హమాలీల సంఖ్యను పెంచాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 27, తెలంగాణ పత్రిక

జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు, మిల్లుల్లో అన్ లోడింగ్ పై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా లక్ష్యం మేరకు ధాన్యం అన్ లోడింగ్ చేయాలని స్పష్టం చేశారు. కొనుగోళ్ల శాతం పెరిగేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా




పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# జూన్ 1 నుంచి సిరిసిల్ల జిల్లాలో సదరం క్యాంపులు

## దివ్యాంగులకు ధృవీకరణ పత్రాల జారీకి ప్రత్యేక వైద్య శిబిరాలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 27, తెలంగాణ పత్రిక



సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జూన్ నెలలో సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన ధృవీకరణ పత్రాల జారీ కోసం ఆర్థోపెడిక్, వినికిడి, కంటిచూపు, మానసిక మరియు జనరల్ విభాగాలకు సంబంధించి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు జూన్ 1వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు వివిధ తేదీల్లో కొనసాగనున్నట్లు వెల్లడించారు.

-సదరం క్యాంపుల షెడ్యూల్:

- జూన్ 1 -- ఆర్థో
- జూన్ 4 -- వినికిడి, మానసిక
- జూన్ 5 -- ఆర్థో, వినికిడి
- జూన్ 8 -- ఆర్థో, కంటిచూపు
- జూన్ 9 -- ఆర్థో
- జూన్ 15 -- కంటిచూపు
- జూన్ 16 -- ఆర్థో
- జూన్ 18 -- జనరల్

క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్-రే రిపోర్టులు, యూడీఐడీ (UDID) అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో మరియు ఫోన్ నంబర్‌తో ఉదయం 9 గంటలకు హాస్పిటల్‌కు చేరుకోవాలని సూచించారు.

# మాదకద్రవ్యాల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు







-రోడ్డు ప్రమాదాల నివారణకు 'బ్లైండ్ స్పాట్స్'పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
-పోలీసు జాగిలాలతో ప్రత్యేక తనిఖీలు..
-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 27:

మాదకద్రవ్యాల నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు 'బ్లైండ్ స్పాట్స్'పై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలు, వసతి గృహాల పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాలకు బానిసైన వారికి డి-అడిక్షన్ కేంద్రంలో చికిత్స అందించాలని, పోలీసు జాగిలాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుసంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి నార్కోటిక్ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాల సరఫరా, క్రయవిక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత ప్రాంతాలు, దుకాణాలు, గోదాములు, రహదారుల వద్ద పోలీసు జాగిలాలతో నిరంతరం తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల పై సమాచారం అందించేందుకు ప్రజలు డ్రగ్స్ ఇన్ఫర్మేషన్ టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రగ్స్ ఇన్ఫర్మేషన్ టోల్ ఫ్రీ నెంబర్ -- 1908 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులను గుర్తించి వారికి సరైన కౌన్సెలింగ్ అందించడంతో పాటు ములుగు ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులు కూడా బాధితులను పునరావాసం దిశగా ప్రోత్సహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రాంతాలు, మూల మలుపులను 'బ్లైండ్ స్పాట్స్'గా గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కనీసం రెండు సార్లు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల వివరాలతో కూడిన పూర్తి బ్లైండ్ స్పాట్స్ వివరాలు సిద్ధం చేసి ఆయా ప్రాంతాలు జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలకు పంపించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం,రక్షణ కోసం భద్రతా కంబాలు ఏర్పాటు చేయడం,రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించేలా బ్లింకర్, వార్నింగ్ లైట్లు అమర్చడం, వాహనదారులను అప్రమత్తం చేసేలా హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే నాలుగు నుండి ఆరు సార్లు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించాలని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డిఓ ప్రతాప్, వరంగల్ నార్కోటిక్ ఈగల్ విభాగం డీఎస్పీ రమేష్ కుమార్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, ఐటీడీఏ డీడీ జనార్ధన్, రవాణా శాఖ అధికారులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణిత శాస్త్ర అధ్యాపకురాలు కస్ప శ్రీలత కు డాక్టరేట్



కామారెడ్డి, మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మర్కల్ గ్రామం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్ ) నందు గణిత శాస్త్ర అధ్యాపకురాలుగా పని చేస్తున్న కస్ప శ్రీలత హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంకా శాస్త్ర విభాగం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి పర్యవేక్షణలో నానో ద్రవాలు, హైబ్రిడ్ నానో ద్రవాలు అయస్కాంత ద్రవగతి ప్రవాహ విశ్లేషణ " అనే అంశం పై పరిశోధన చేసి, పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గాను గౌరవ డాక్టరేట్ పొందడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, అధ్యాపక బృందం శ్రీలతను అభినందించారు.

## ఐకెపి వివోఏలకు 20 వేల వేతనం అమలు చేయాలి : సిఐటియు డిమాండ్



తెలంగాణ పత్రిక దమ్మపేట మే 27

దమ్మపేట:–కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఐకెపి వివో ఏ లకు 20వేల రూపాయలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఒక్క రూపాయి కూడా వివోఏలకు జీతం పెంచలేదని సిఐటియు జిల్లా ఉపద్యాక్షులు పిట్టల అర్జున్ విమర్శించారు . బుధవారం ఐకెపి పిఓఏ ల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాద్యాక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానాలు నీటి మీద రాతలు లాగా మారాయని విమర్శించారు. గత ప్రభుత్వం గ్రామ సంఘాల ద్వారా 3000 రూపాయలు వేతనం చెల్లిస్తామని ఇచ్చిన వాగ్దానం కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. గ్రామ సంఘాల్లో నిధులు లేవనే పేరుతో ప్రభుత్వం పెంచిన జీతాన్ని అమలు చేయలేదని ఈ జీతాన్ని అమలు చేయటానికి అవసరమైన నిధులను ప్రభుత్వమే కేటాయించాలని డిమాండ్ చేశారు. 20 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, గ్రేడింగ్ తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలను వివో ఎ ల వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ నాణ్యమైన లాప్టాప్ లు ఇవ్వాలని పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సమ్మె చేస్తున్న వివో ఏలకు అండగా ఉంటామని వాగ్దానం చేసిన వారు ఇప్పుడు ఎమ్మెల్యేలుగా గెలిచి శాసనసభలో ఉన్నారని వారు మా డిమాండ్లపై ప్రస్తావన చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు ఐకెపి వివోఏ సంఘం నాయకులు ధనలక్ష్మి శ్రీలత చెన్నమ్మ పద్మ వెంకటలక్ష్మి శ్రీదేవి భద్రమ్మ సీత రేఖ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో రైతులకు నష్టం కలగకుండా వేగంగా ధాన్యం తరలించాలి



–జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో ఉన్న గురు రాఘవేంద్ర రైస్ మిల్‌ను తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు, రవాణా , మిల్లింగ్ ప్రక్రియపై అధికారులతో సమీక్ష చేసి ప్రతి రోజు కనీసం 15 లారీల దాన్యం దించుకోవాలి అని మిల్లర్ లను ఆదేశించారు. అనంతరం శాబ్దిపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూరి ఎల్లారెడ్డి వరి కొనుగోలు కేంద్రం, శ్రీ మన్నారాయణ రైస్ మిల్‌లను పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 1,100 మెట్రిక్ టన్నుల వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,78,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ప్రస్తుతం 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలో ఉన్నట్లు పేర్కొన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉండకుండా కంధకం కాలువలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కుప్పలను టార్పాలిన్‌లతో క్రింది నుండి పైకి, పైనుండి క్రిందకు కప్పి ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్ ,సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తహశీల్దార్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి







–జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 27:

బాల్య వివాహాలను అరికడితేనే బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, ప్రతి వివాహానికి ముందు వయస్సు నిర్ధారణ తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. చదువు, ఆరోగ్యం, స్వేచ్ఛను కాపాడాలంటే బాల్య వివాహాలకు పూర్తిగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో "బాల్య వివాహం -- బతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సామాజిక దురాచారమని పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికలు విద్య, ఆరోగ్యం, హక్కులు, స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆడపిల్లలకు సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లకు ఎక్కువగా ఉంటుందని, వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారం ముందుగానే తెలిసే అవకాశం ఉన్నందున ప్రజల సహకారం ఉంటే జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.బాల్య వివాహాల నిర్మూలనలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఆడపిల్లల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేసి బాల్య వివాహాలు లేని ములుగు జిల్లాను నిర్మించాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతు న్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అంతకుముందు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ బాల్య వివాహ నిరోధక చట్టం--2006పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్వహించినట్లయితే ఎవరికి ఎలాంటి శిక్షలు ఉంటాయో, బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, చట్టపరమైన నిబంధనలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, సిడిపిఓ కె. శిరీష, సూపర్వైజర్లు, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి, సఖి కేంద్రం సెంటర్ అడ్మిన్ లావణ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నరేష్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సఖి, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది,ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

–కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలి.

–జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 28:



రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, తేమ శాతం నమోదు, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వ విధానం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, నీడ, వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగంగా కొనుగోలు చేసి, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, కవర్లు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు డబ్బుల చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం క్రిష్ణవేణి,సంబంధిత శాఖల అధికారులు, పి.ఏ.సి.ఎస్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

కామారెడ్డి, మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ముస్లిం సోదరులకు బక్రీద్ సందర్భంగా మసీదు, దర్గా ల వద్ద ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆదేశించారు .కామారెడ్డి పట్టణంలోని ఈద్గాల వద్ద వేగంగా సాగుతున్న పనులు ముస్లింల పవిత్ర పండుగ 'త్యాగాల నిరతి బక్రీద్'ను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి మున్సిపల్ శాఖ తరఫున అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను చకచకా పూర్తి చేస్తున్నట్లు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన ఈద్గాల వద్ద జరుగుతున్న ముందస్తు పనులను మున్సిపల్ కౌన్సిలర్లు మరియు అధికారులతో కలిసి ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పండుగ రోజున ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ తరఫున పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈద్గాల మైదానాల పరిసరాలలో ఈ క్రింది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు: ముఖ్యమైన ఆదేశాలు – మున్సిపల్ చర్యలు: పరిశుభ్రత (శానిటేషన్): ఈద్గా పరిసరాల్లో పిచ్చిమొక్కలను తక్షణమే తొలగించాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు పండుగ రోజంతా శానిటేషన్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలి. రోడ్ల మరమ్మతులు ఢ విద్యుత్: ఈద్గాలకు వెళ్లే దారుల్లో ఉన్న గుంతలను పూడ్చివేయాలి. వీధి దీపాలను (మున్సిపల్ లైట్లను) పునరుద్ధరించి, వెలుతురు సమస్య లేకుండా చూడాలి. తాగునీటి సౌకర్యం: ప్రార్థనలకు వచ్చే భక్తుల కోసం ఈద్గాల వద్ద తగిన తాగునీటి వసతిని కల్పించాలి. ముస్లిం సోదరులంతా బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలి. మున్సిపల్ అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసి గడువులోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి." ఇప్ప ఉమారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్న ముఖ్య నాయకులు, అధికారులు: ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ హన్మంత్ రావు, కౌన్సిలర్లు గ్యార అఖిల, వాజీద్, అంజాద్, జావీద్, అన్వర్, లడ్డు, నిట్టు గంగాధర్, కో–ఆప్షన్ మెంబర్ అలీబిన్ అబ్దుల్లా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్యార సాయిలు, అమీర్, మున్సిపల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది మరియు ముస్లిం మత పెద్దలు అమీర్,హైమద్ పాల్గొన్నారు.

## జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్




జగిత్యాల మే 27 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు.అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బందిఅందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు.సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు,గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీ డీఎస్పీ పురుషోత్తం రెడ్డి,రూరల్ ఎస్.ఐ ఉమా సాగర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రైతుల రాస్తా రోకో




**- వడ్లు అమ్మి నెల అయిన తరలించని ధాన్యం**
**- కిలో మీటర్ల నిలిచిన వాహనదారులు**

ముధోల్:27మే(తెలంగాణ పత్రిక)

ఆరుగాలం కష్టించి పంటను పండించేందుకు రైతులు ఏడాది పొడవునా శ్రమించి పండించిన ధాన్యం విక్రయించడానికి ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం బాసర-బైంసా జాతీయ రహదారిపై మండలంలోని తరోడ వద్ద చించాల,పిప్రి, వెంకటాపూర్, ముద్గల్, సరస్వతి నగర్, తరోడ గ్రామాల రైతులు రాస్తారోకను చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మి నెల రోజులు గడుస్తున్న లారీలు రాకపోవడంతో కల్లాల వద్దనే ఉండడం ఏమిటని ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అధికారులు లారీల వెంటనే పంపించాలని రైతులు రహదారిపై భీష్మించి కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న ముధోల్ సిఐ రవీందర్ నాయక్, ఎస్సై బిట్ల పెర్సిస్ రాస్తారోకో వద్దకు చేరుకొని రైతులను సముదాయించారు. దీంతో జిల్లా కలెక్టర్ వచ్చేంతవరకు రాస్తారోకోను విరమించేది లేదని రైతులు మొండికేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ శ్రీలత, ఆర్ఐ సత్యనారాయణ పటేల్ చేరుకొని రైతులను సముదాయించారు. వెంటనే లారీలను పంపించి వడ్లను గోదాములకు తరలించాలని రైతులు రహదారిపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. మార్క్ఫెడ్ డిఎం కు తహసిల్దార్ ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసింది. రైతులు నేరుగా ఫోన్ లో మాట్లాడి మధ్యాహ్నం వరకు లారీలను పంపిస్తే రాస్తారోకో విరమిస్తామన్నారు. తహసిల్దార్, మార్క్ఫెడ్



డిఎం లారీలు వస్తాయని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను రైతులు ఎట్టకేలకు విరమించారు. ఈ రాస్తారోకో సుమారు గంటపాటు చేయడంతో సుమారు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. సీఐ రవీందర్ నాయక్, ఎస్సై పోలీసులచే ట్రాఫిక్ ను నియంత్రించారు. ఈ రాస్తారోకోలు సర్పంచులు ఆరీపొద్దిన్, సర్వేశ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రాణంతో మన మధ్య లేకున్నా సుప్రియ చిరంజీవి

**-అవయవదానంతో పలువురికి పునర్జీవం..!**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 27

జగిత్యాలలో వివాహిత అవయవ దానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు ప్రసరించి మానవత్వం చాటుకున్నది. వివరాల్లోకి వెళితే మే 24న ఆదివారం జగిత్యాల పట్టణం హనుమాన్ వాడ కు చెందిన అక్కపెల్లి ప్రవీణ్ సతీమణి సుప్రియ (25) అనే మహిళ స్కూటీ బండి నడిపించడం నేర్చుకునే క్రమంలో బండి పై నుండి ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాదులోని యశోద హాస్పిటల్ కి తీసుకెళ్లాలని సూచించారు.గత మూడు రోజులుగా యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్ పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు కానీ ఆమె ఆరోగ్యం కుదుటపడక పోగా మరింత విషమంగా మారి బ్రెయిన్ డెడ్ అయిందని, తిరిగి కోల్కోవడం కష్టతరమని డాక్టర్లు నిర్ధారణ చేశారు.గత మూడు రోజులుగా మృత్యువు తో పోరాడిన సుప్రియ గతరాత్రి తుది శ్వాస విడిచారు.దీనితో ఆమె భర్త అక్కపెల్లి ప్రవీణ్, కుటుంబ సభ్యులు మహిళ అవయవాలను స్వచ్ఛందంగా దానం చేయడానికి ముందుకు రావడంతో, ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్ ప్రతినిధులతో మాట్లాడి అవయవ దానం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.సుప్రియ శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు,కళ్ళు, మూత్రపిండాలు,కాలేయం ను జీవన్ దాన్ ప్రతినిధులు సేకరించినట్లు తెలిసింది. అనంతరం వారు మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఈ అవయవాలతో చాలా మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపజేసిందని సుప్రియను కొనియాడారు.ఆమెకు భర్త,ఇద్దరు కూతుర్లు తేజశ్రీ (6), వైష్ణక (3) ఉన్నారు. అతి చిన్న వయసులో ఇద్దరు పిల్లలని వీడి అనంత లోకాలకు వెళ్లిన సుప్రియ ఉదంతం తెలిసిన ప్రతి ఒక్కరు ఒక వైపు కొనియాడుతుంటే, మరోవైపు కుటుంబ సభ్యులు,



ప్రాంత ప్రజలు చిన్న పిల్లలను చూసి కన్నీటి పర్యంతమౌతున్నారు. ఇక మరికొందరు పట్టణ ప్రముఖులు సుప్రియ చిరంజీవిగా మిగిలిపోయిందని ప్రశంసిస్తున్నారు.

## భూ భారతి, రెవెన్యూ సదస్సుల పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి


**-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి, మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

సీసీఎల్ఏ, హైదరాబాద్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆధ్వర్యంలో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ,రెవెన్యూ సదస్సులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి 2026 జూన్ 4వ తేదీ లోపు పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా దరఖాస్తుల పరిష్కారం పూర్తి కాకపోతే సంబంధిత అధికారులు తమ సిబ్బందితో కలిసి ఐడీఓసీ-కలెక్టరేట్‌లో హాజరై జూన్ 5 , 6 తేదీల్లో పనులను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా సాదాబైనామా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ నుసన్మానించిన
## మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్



కామారెడ్డి ,మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రగీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్ ను టిపిసిసి కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కామారెడ్డి జిల్లాదోమకొండ మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీ గల తిరుమల్ గౌడ్, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ సన్మానించారు. చంద్రశేఖర్ గౌడ్ కు గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## అండర్ 11 బ్యాడ్మింటన్లో రాష్ట్రస్థాయికి నగేష్ ఎంపిక




తెలంగాణ పత్రిక, మే 27

దమ్మపేట: మే 23, 24 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామానికి చెందిన మరీదు నగేష్ అండర్ 11, అండర్ 13 సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సంపాదించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. అండర్ 13 డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. అతి చిన్న వయస్సులో క్రీడల పట్ల మక్కువ రాష్ట్ర స్థాయిలో ఎంపిక అవ్వడం పట్ల నగేష్ గ్రామస్తులు హర్షిస్తున్నారు.

## నేడే బక్రీద్ పండుగ, దాని పారమార్థం

**-లెక్చరర్ ఉమాశేషారావు**

కామారెడ్డి ,మే 27,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




త్యాగం, మానవత్వం బక్రీ ద్ లేదా ఇద్ అల్ అధ్ ముస్లింలకు రంజాన్ తర్వాత ముఖ్యమైం పండుగా. ఈ పండుగత్యాగం, భక్తి, దానం వంటి నైతిక విలువలను బోధిస్తుంది. ముస్లిం లు ఆధ్యాత్మిక భావ నతోకూడిన పండుగ. బక్రీద్ పండుగకు మూలం ప్ర వక్త ఇబ్రహీంగారి జీవితం లో జరిగిన సంఘటన. అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం తన కుమారుడిని త్యాగం చే యడానికేసిద్ధపడిన ,ఆయన భక్తిని పరీక్షిం చడా కి,అల్లాహ్ ఒక జంతు వును ప్రత్యామ్నాయంగా ఇచ్చాడని విశ్వసిస్తారు ఈ సంఘటన త్యాగం మరి యు దేవుని పై నమ్మకా నికి ప్రతీకగానిలిచింది. ఈ పండుగ రోజు ముస్లింలు ప్రత్యేక సామూహిక ప్రార్థ నలు చేస్తారు.ప్రార్థన తర్వాత కుర్బానీ అనే జంతువును బలి ఇస్తా రు. ఆ మాంసాన్ని మూ డు భాగాలుగా వి భజించి ఒక భాగం కుటుంబానికి, ఒక భాగం బంధువులకు, ఒక భాగం పేదలకు పంచుతా రు.ఈ విధంగా సామాజం లో సాహకారం మరియు దానధర్మాలు పెంపొందు తాయి.పేదల ఆకలి తీరు తుంది. దీని పరమా ర్థం మనిషి తన లోని అహం కారాన్ని, స్వార్థం, వంటి చెడు లక్షణాలు వదిలి మం చి మార్గంలో నడువలి అ ని సూచిస్తుంది. దేవుని ఆజ్ఞలను విధేయ తతో ఆచరించి,పేదలకు దానం చేసే తత్వాన్ని, మానవ సేవ అల్లహ్ సేవ,వట్టి చే తు ల తో వచ్చం,వట్టి చేతులతో పోతాం, మనిషిలోమానవ త్వాన్ని పురిగొ ల్పే పండు గలలో బక్రీద్ ప్రథమస్థానమువహిస్తుంది.

## శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

**-వీవోఏల ఒంటికాలి పైన నిరసన**

తానూర్:27మే(తెలంగాణ పత్రిక)



న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తానూర్ తాహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ఐకెపి వీవోఏల ఐదవ రోజు సమ్మె చేపట్టారు. ఒంటి కాలుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీవోఏల మండల కమిటీ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు రూ,,26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 58 సవరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ముత్యం,తో పాటు ఐకెపి వీవోఏ సభ్యులు పాల్గొన్నారు

## అంధ విద్యార్థికి జిల్లారెడ్ క్రాస్ సొసైటీచేయుత



కామారెడ్డి, మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాబిక్నూర్ మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన అంధ విద్యార్థి ప్రభు బాబు డిగ్రీ (బిఏ) మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రభు బాబుకు ల్యాప్ టాప్ అవసరమని జిల్లా కలెక్టర్ ఆశిస్ సాంగ్వాన్ ను కలిసి విన్నవించుకోగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటికి 10,000 మంజూరు చేయమని సిఫార్స్ చేయగా బుధవారం జిల్లా వైస్ ఛైర్మన్ అంకన్నగారి నాగరాజ్ గౌడ్,జిల్లా సెక్రటరీ రఘు కుమార్ తో కలిసి 10, 000రూపాయల చెక్కును అందజేశారు ఈ సందర్భంగా అంధ విద్యార్థి ప్రభు బాబు మాట్లాడుతూనా పరిస్థితి వివరించగానే స్పందించిన జిల్లా కలెక్టర్ ఆశిస్ సాంగ్వాన్ కు, రెడ్ క్రాస్ సొసైటి ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు ఈకార్యక్రమంలో జిల్లా కరస్పాండెంట్ పీవీ నరసింహం పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్‌ను కలిసిన జర్నలిస్టులు



రంగారెడ్డి జిల్లా, మే 27,( తెలంగాణ పత్రిక )

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ ను పలువురు జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొంటున్న వివిధ లా అండ్ ఆర్డర్ అంశాలపై వారు విస్తృతంగా చర్చించారు. ఇటీవల కొంతమంది మావోయిస్టులు లొంగిపోయిన సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కూడా జర్నలిస్టులు పాల్గొన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న వివిధ దాడులు, ముఖ్యంగా జర్నలిస్టులు, పోలీసులు, న్యాయవాదులపై జరుగుతున్న ఘటనలను ప్రతినిధులు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డీజీపీ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు క్రాంతి కుమార్, జర్నలిస్టు దుర్గ భవాని పాల్గొని రాష్ట్రంలో శాంతిభద్రతలు, మీడియా భద్రత తదితర అంశాలపై డీజీపీతో పలు విషయాలు చర్చించారు..

## వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

-లారీల కొరతతో కేంద్రాల్లోనే నిలిచిపోతున్న ధాన్యం బస్తాలు.. వర్షాల భయంతో రైతుల ఆందోళన



ఇల్లంతకుంట మే 27 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు. లారీల కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.లారీలు సకాలంలో రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ప్రారంభమైన నేపథ్యంలో ఎప్పుడైనా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోతున్నాయి. లారీలు రాక ధాన్యం తరలడంలేదు. వర్షం వస్తే మా కష్టం అంతా వృథా అవుతుంది. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి లారీలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు వేగవంతం చేయాలి" అని రైతులు కోరుతున్నారు. వర్ష సూచన ఉన్నందున యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# అకాల భారీ వర్షం అన్నదాతను తీవ్రంగా దెబ్బతీసింది









-కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు ఆశగా తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిస ముద్దయింది.

-దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 27 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లో మంగళవారం రాత్రి కురిసిన అకాల భారీ వర్షం అన్నదాతలను తీవ్రంగా దెబ్బతీసింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆశగా తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయ్యింది. రోజుల తరబడి కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రక్షణ చర్యలు లేకపోవడం, గోదాములు లేకపోవడం వల్ల ధాన్యం నీటిలో నానిపోయి భారీ నష్టం వాటిల్లింది.కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, షెడ్లు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా ధాన్యంపై పడింది. దీంతో ధాన్యం రంగు మారి నాణ్యత తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా లేదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే పెట్టుబడుల భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షం మరింత కష్టాలను తెచ్చిపెట్టింది. కొంతమంది రైతులు రాత్రంతా కొనుగోలు కేంద్రాల వద్దే ఉండి ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయి. నీటిలో తేలుతున్న ధాన్యపు సంచులు రైతుల దుస్థితిని స్పష్టంగా చూపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

# పంట వ్యర్థాల దహనం నేల ఆరోగ్యానికి ప్రమాదం

-రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించాలి

-మండల వ్యవసాయ అధికారి వి. కవిత

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 27 (తెలంగాణ పత్రిక):



మాసాయిపేట మండల వ్యవసాయ అధికారి వి. కవిత రైతులకు కీలక సూచనలు చేశారు. పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి, మొక్కజొన్న గడ్డి వంటి పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల నేల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. పొలాలను త్వరగా శుభ్రం చేసేందుకు రైతులు పంట వ్యర్థాలను కాల్చు తున్నప్పటికీ, దీర్ఘకాలంలో ఇది నేల సారవంతతను తగ్గిస్తుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్ నశించి, నేల సారహీనంగా మారుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు, వానపాములు నశించి నేల ఉత్పాదకత తగ్గుతుందని వివరించారు. నత్రజని, గంధకం వంటి ముఖ్య పోషకాలు వాతావరణంలోకి వెళ్లిపోవడంతో రసాయన ఎరువులపై ఆధారపడాల్సి వస్తుందని తెలిపారు. పదేపదే కాల్చడం వల్ల నేల గట్టిపడి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని, వేర్ల పెరుగుదలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. అంతేకాకుండా వాయు కాలుష్యం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలు పెరిగి మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చకుండా మల్చింగ్, కంపోస్టింగ్, మట్టిలో కలపడం, హ్యాపీ సీడర్ యంత్రాల వినియోగం, బయో-డీకంపోజర్ స్ప్రేలు వంటి సుస్థిర పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. నేల ఆరోగ్యం, పంట దిగుబడులు మరియు పర్యావరణ పరిరక్షణ కోసం రైతులు అవగాహనతో వ్యవహరించాలని కోరారు.

# బక్రీద్ బందోబస్త్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు






-స్పందనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

-పికెట్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి :

-అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 27 (తెలంగాణ పత్రిక):

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బందోబస్త్ విధులకు హాజరైన పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన డ్యూటీ పాయింట్లలో సమయానికి హాజరై అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డయల్-100 వాహనాలు అత్యవసర ఘటనలకు వేగంగా స్పందించాలని పేర్కొన్నారు. స్పందనలో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పికెట్ విధుల్లో ఉన్న సిబ్బంది అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, సమయానికి నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో నిష్పక్షపాత ధోరణితో వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు సందీప్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి, మహేష్, రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘంజిల్లా ఇన్చార్జిగా దేమే యాదగిరి పటేల్

కామారెడ్డి, మే 27 ,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా ఇన్చార్జిగా మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన దే మే యాదగిరి పటేల్ను జిల్లా ఇన్చార్జిగా నియమించారు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు ఆదేశాల మేరకు బుధవారం కామారెడ్డిలో జరిగిన సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షులు అంజయ్య తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ నీలం నర్సింలు పటేల్ ఆధ్వర్యంలో ఈరోజు సమావేశం నిర్వహించారు అనంతరం జిల్లా ఇన్చార్జి దేమే యాదగిరి పటేల్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి మున్నూరుకాపు సంఘాలను బలోపేతం చేయాలి, జుక్కల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నియమించాలి నూతనంగా మండల కోఆర్డినేటర్లు , మండల యూత్ అధ్యక్షులను, మండల మహిళా అధ్యక్షులను, నియమాకం చేయాలని, కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఐసి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు అనుమాల రామ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సంకరి రాజలింగం, రైతు విభాగం అధ్యక్షులు సిద్ధన్నడాక్టర్స్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రాజేష్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మామిళ్ల లింగం దోమకొండ మండల అధ్యక్షులు కూర చంద్రం రాజంపేట మండల అధ్యక్షులు సర్పంచ్ శ్రీకాంత, కౌన్సిలర్ కాసర్ల రవీందర్గొటాలపల్లె సర్పంచ్ ఆకుల శ్యామ్ పంతులు శీను, ఆర్మీ రాములు ,ప్రశాంత్ తదితరులు పాల్గొనడం జరిగింది. నీలం నర్సింలు పటేల్మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసిందానికి దేమే యాదగిరి పటేల్కు కుల బాంధవులందరికీ, ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగింది.. అందరినీ నియామకం చేస్తూ లిస్టు త్వరలో పంపిస్తామని తెలియజేయడం జరిగిందని వివరించారు.

# సుల్తానాబాద్ మండలంలోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







-బాలసదనం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.
-తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు చోటు లేదు
-పెండింగ్ భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

పెద్దపల్లి, ప్రతినిధి మే 27 ( తెలంగాణ పత్రిక )

మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాల సదనం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్‌లోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరలమణారావు చేతుల మీదుగా బాలసదనం ప్రారంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసదనం నిర్వహణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చిన్నారులకు సౌకర్యవంతమైన మరియు భద్రమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు.అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడి వసతులు, ఆహారం, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తదుపరి సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా ద్వారా వివిధ ధృవపత్రాల కోసం వచ్చే దరఖాస్తులను సకాలంలో స్క్రూటినీ పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రజలు తమ సమస్యలను నేరుగా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబు దారీతనం, ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో బి. డబ్ల్యూ.ఓ. వేణుగోపాల్, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరోద్దీన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వర్షానికి తడిసి ముద్దయి ధాన్యం



-వర్షపు నీటిలో కొట్టుకు పోయిన వడ్లు





నంగునూరు, మే 27(తెలంగాణ పత్రిక):

మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోళ్లలో ఆలస్యం, తూకం వేసిన బస్తాల తరలింపులో నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కుప్పలు పేరుకు పోయాయి. బస్తాలను రోజుల తరబడి కేంద్రాలలో వదిలేయడంతో చాలా చోట్ల బస్తాలు చెదలు పడుతోంది. దీనికి తోడు మంగళవారం కురిసిన వర్షానికి కేంద్రాల్లోని ధాన్యం తడిసి పోయింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల పేట బండపై ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సిద్ధన్నపేటలోని నంగునూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వడ్లు, మొక్కజొన్నల రాశులతో సందు లేకుండా ఉంది. రాత్రి కురిసిన వర్షానికి నీళ్ళు రాశుల మధ్య నిలిచి తొలగించడానికి వీలు లేకుండా మారింది. దీంతో వడ్ల కుప్పలు, మొక్కజొన్నల కుప్పల కిందికి నీరు చేరింది. నంగునూరులో తోకల బండపై ధ్యానం వానకు కొట్టుకు పోయింది. గట్లమల్యాల, తిమ్మాయిపల్లి, అంక్షాపూర్ తదితర గ్రామాలలో గ్రామాలలో ధాన్యం పూర్తిగా తడిచి పోయిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తాలలో నింపిన ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. మామిడి తోటల్లో మామిడి కాయలు రాలి పోయాయి. వర్షంతో కూడిన ఈదురు గాలులకు అంక్షాపూర్ గ్రామానికి చెందిన నమిలే రాజిరెడ్డికి చెందిన ఇంటి రేకులు పూర్తిగా లేచిపోయాయి. తిమ్మాయపల్లిలో మోత్కు కరుణాకర్ అనే రైతుకు చెందిన పశువుల పాక కూలిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, వర్షానికి కొట్టుకు పోయిన ధాన్యానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయి పలు గ్రామాలు చీకటిలో మగ్గాయి. రాంపూర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో వ్యవసాయ క్షేత్రాల వద్ద నాలుగు చోట్ల 12 కేవీ విద్యుత్ వైర్లు తెగి పోయాయి. కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా విద్యుత్ లైన్ మెన్ దుబ్బుడు సంపత్ రెడ్డి, అసిస్టెంట్ లైన్ మెన్ పడిగే శ్రీనివాస్, విద్యుత్ హెల్పర్ ఆరుట్ల శ్రీనివాస రెడ్డి లు రాత్రి చిమ్మ చీకట్లో వ్యవసాయ క్షేత్రాలు తిరిగి తెగిన తీగలను గుర్తించారు. రాత్రి మూడు గంటల సమయంలో తీగలను అతికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

## కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలపై నేడు నిరసన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

మిర్యాలగూడ ప్రతినిధి//మే 27:(తెలంగాణ పత్రిక):-

కేంద్ర ప్రభుత్వం వానాకాలం 26 -27 సంవత్సరానికి రైతులు పండించిన పంటలకు కనీస ధరను అశాస్త్రీయంగా ప్రకటించింన దానికి నిరసనగా వామపక్ష రైతు సంఘాలు గురువారం నాడు మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆసంఘాల ప్రతినిధులు తెలిపారు. బుధవారం నాడు స్థానిక రైతు సంఘం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వసుకుల మట్టయ్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల శ్రద్ధ లేదని మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఆరుగాలాలు రైతు కష్టించి పండించిన వివిధ రకాల ధాన్యాలకు గిట్టుబాటు ధర ప్రకటించకపోవడం విచారకర మన్నారు. వివిధ రాష్ట్రాల ఎన్నికలకు ముందు డీజిల్ పెట్రోల్ ధరలపై నోరు మైదపని కేంద్ర ప్రభుత్వం అనంతరం ధరలను పెంచడం రైతులను ఇబ్బందులు పెట్టడమేనని వారన్నారు. దేశానికి వెన్నుముకైనా రైతును ఇబ్బంది పెడితే అట్టి ప్రభుత్వాలకు ప్రజలు సరైన సమయంలో సరైన సమాధానం ఇస్తారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న విధానాలను



వ్యతిరేకిస్తూ గురువారం జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి. రైతు సంఘం జిల్లా నాయకులు పోలేపల్లి గోవిందరెడ్డి. చౌగానే వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 27

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లిం సోదర, సోదరీమణులు వారి యొక్క కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో ఆహ్లాదకరంగా, సంతోషంగా పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. అదేవిధంగా ఈద్గా, మసీదులకు వెళ్ళు మార్గాలలో ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా భద్రతా పరమైన ఏర్పాట్లు చేశారని తెలియజేయడం జరిగింది. ఎవరైనా అనుమానా స్పదంగా కనిపించినట్లయితే పోలీస్ శాఖకు తెలియజేయవలసిందిగా లేదా డయల్ 100ను సంప్రదించవలసిందిగా ప్రజలకు పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేయడం జరిగింది.



## ఒంటి కాలుపై ఐకేపీ వీఓఏల నిరసన




ముధోల్:మే27(తెలంగాణ పత్రిక):

మండల కేంద్రమైన ముధోల్ లోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం 6వ రోజుకు చేరుకోవడంతో వీఓఏలు ఒంటి కాలుపై నిలబ డి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అధ్యక్షులు వినీత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వివోఏలకు కనీస వేతనంగా నెలకు రూ.26 వేలును నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే తమను సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న తమకు సరైన గౌరవం, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ముత్తవ్వ, కోశాధికారి దేవేందర్, సహా కార్యదర్శి సునంద,వివో ఏలు లత, రాజు ప్రశాంత్, ఒమేశ్వర్,రమాదేవి, ఫతిమ, మమత,తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ, గౌరవం దక్కాలి

-కామారెడ్డిజిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ వై గిరి




కామారెడ్డి ,మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పని ప్రదేశాలలో మహిళలకు రక్షణతో పాటు తగిన గౌరవం దక్కాలని, పురుషులు మహిళలను వేరే దృక్పథంతో చూడకుండా తోటి ఉద్యోగులుగా గౌరవించాలని కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్ వై గిరి .'99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ఉమెన్ వీక్ (మహిళా వారం) మూడో రోజు వేడుకల్లో భాగంగా.. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013" పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆలోచనా విధానంలో మార్పు రావాలి విద్యా రంగంలో ఎంతో పురోగతి సాధించినప్పటికీ, కుటుంబాల్లో ఇంకా ఆశించిన మార్పు రావడం లేదని, ఇప్పటికీ కుటుంబ పెద్దలే యజమానులుగా వ్యవహరిస్తున్నారని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా దూసుకుపోతున్న తరుణంలో, వారు ఎలాంటి హింసకు గురికాకుండా ఉండేందుకే చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలు వేధింపులకు గురైనప్పుడు మాత్రమే ఈ చట్టాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని దుర్వినియోగం చేసేవారిని ప్రభుత్వం బదిలీ పెట్ట బోదని హెచ్చరించారు.

## ధాన్యం భద్రత ప్రభుత్వం తీసుకుంటుంది

-అన్నదాతలు ఆందోళన చెందవద్దు
- నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూరు, మే 27(తెలంగాణ పత్రిక):



ధాన్యం భద్రత తమనిదేనని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని సిద్దన్నపేట, పాలమాకుల, రాజగోపాలపేట, వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి రైతులకు అండగా నిలువాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా, మండల అధికారులకు కీలక సూచనలు చేశారని పేర్కొన్నారు. వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం అయిందని చెప్పారు. ఈ క్రమంలో అధికారులతో కలిసి ధన్యనాన్ని గోదాములకు తరలించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులపై అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించామని చెప్పారు. వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల పేట సర్పంచ్ చేర్యాల రాణి కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ గంగుల రవి, బస్వరాజు రాములు, తిరుపతి, నర్సింహా రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, ఏటి చంద్రం పాల్గొన్నారు.

# తడిసిన బస్తాలను మిల్లులకు తరలిస్తాం

**– పాలమాకుల పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లెంకి మహిపాల్ రెడ్డి**



**నంగునూరు, మే 27(తెలంగాణ పత్రిక):**
తూకం వేసి తడిసిన ధాన్యం బస్తాలను బియ్యపు మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని పాలమాకుల పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లెంకి మహిపాల్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు బుధవారం ఎల్లంకి మహిపాల్ రెడ్డి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని వెల్కటూర్, తిమ్మాయిపల్లి, కోనాయిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తూకం వేసిన తర్వాత కొనుగోలు కేంద్రాలలో తడిసిన బస్తాల వివరాలను సెంటర్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. తడిసిన బస్తాలను బియ్యపు మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అధికారులతో మాట్లాడి త్వరగా లారీలు పంపే ఏర్పాట్లు చేయాలని కోరారు.

# ప్రజా పాలన 99రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు



**మాడుగుల పల్లి//నల్గొండ//మే 27:(తెలంగాణ పత్రిక):-**
దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో గల మాడుగులపల్లి మండలం ఆగమోత్కూరు గ్రామ పంచాయతీలో 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు 25మే నుండి జూన్ 1వరకి జరిగే కార్యక్రమాల్లో భాగంగా మహిళా వారోత్సవాలు అంగన్వాడీ పరిధిలో సిడిపిఓ ఆదేశాల మేరకు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీపీస్ రమణి మాట్లాడుతూ బాల్య వివాహము వల్ల బతుకు ఆగము అనే నినాదం సోషల్ మీడియా మరియు పోస్టర్ మరియు అవగాహన కార్యక్రమాలు చేయడం బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించటం జరిగింది. గ్రామపంచాయతీ నుండి బాల్య వివాహాలు చేయరాదు అనే తీర్మానం ఇవ్వాలని కూడా చెప్పటం జరిగింది. సర్పంచ్ అండెం రేణుక మాట్లాడుతూ బాల్య వివాహరహిత గ్రామంగా చేయడానికి తమ వంతు కృషి చేస్తాం అన్నారు. ఈ ప్రోగ్రాం కి అంగన్వాడీ సూపర్వైజర్ జ.నాగమణి, ఐసీపీస్ కౌన్సిలర్ రమణి, హెచ్ఎం వినోదుకుమార్, హెల్త్ సూపర్వైజర్ నర్సయ్య, ఏఎన్ఎం వనజాత, అంగన్వాడి టీచర్ హేమలత, శకీరాబాను, ఆశ వర్కర్స్, కిషోర్ బాలికలు గ్రామ పెద్దలు గర్భిణీ బాలింతలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ 62వ వర్ధంతి

**–చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్**

**మిర్యాలగూడ ప్రతినిధి//మే 27:(తెలంగాణ పత్రిక):-**



భారతదేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత శిల్పి, భరతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 62వ వర్ధంతి వేడుకలు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజేత నెహ్రూ అని కొనియాడారు. దేశ పురోభివృద్ధికి అవసరమైన ఐఐటీ లు, అయిమ్స్, భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనకు ఆయనే పునాది వేశారని గుర్తుచేశారు. భారతదేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య విలువలు బలంగా నిలబడడానికి నెహ్రూ చేసిన కృషి అనన్యసామాన్యమైనదన్నారు. నేటి తరం నాయకులు, కార్యకర్తలు నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపినర్ ఛైర్మన్ పోలగాని వెంకటేష్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు గుండు నరేందర్ గౌడ్, దిలావర్పూర్ సర్పంచ్ విజయం సాయి, వివిధ విభాగాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు

# కొనుగోళ్లు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి





**–జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే -27**
తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం మండలం లోని సముద్రలింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఆరా తీయగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, తూకం వేసిన బస్తాలను మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నామని కలెక్టర్ కు వివరించారు. తూకం వేసిన బస్తాలను జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల నుండి తరలించాలని కలెక్టర్ సూచించారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగానే టార్పాలిన్లు సరిపడా అందుబాటులో పెట్టుకోవడం ద్వారా వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు తరలించిన అనంతరం మిల్లులో అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. సన్న రకాల సాగుపై దృష్టి సారించాలని రైతులను కోరారు. తనిఖీలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, స్థానిక సర్పంచ్ గంగ సాయవ్వ రాజారాం తదితరులు ఉన్నారు.

# అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి ధాన్యం రక్షణ చర్యలు చేపట్టాలి





**–జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 27**
చుంచుపల్లి మండలం పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో సుమారు 1200 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని సుజాతనగర్‌లోని రైస్ మిల్‌కు రెండు రోజులలోపు తరలింపు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీరు ధాన్యం నిల్వల వద్ద చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, రవాణా పనులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రైతులకు కేంద్రాల్లో తాగునీరు, నీడ, సదుపాయాలు వంటి అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు .అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంటడి సి ఓ ప్రేమ్ కుమార్, డి ఎం సతీష్, చుంచుపల్లి తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ కాన్పులు పెంచాలి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ తుకారాం రాథోడ్





**–ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 27**
ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, గర్భిణీల రిజిస్టర్లు, టీకాల కార్యక్రమ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణీలకు ఈ డి డి క్యాలెండర్ ప్రకారం ప్రసవ తేదీలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి గర్భిణికి కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. గర్భిణీలు ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని, పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ కాన్పుల శాతాన్ని పెంచేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తల్లి శిశు మరణాలను తగ్గించేందుకు హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓ ఆర్ ఎస్ ద్రావణాలు తీసుకోవాలని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రాబోయే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి మైక్రో ప్రణాళికను సిద్ధం చేసి, ఐదేళ్ల లోపు పిల్లల లైన్ లిస్ట్ తయారు చేయాలని ఆదేశించారు ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఇంటింటికి వెళ్లి 0.నుండి 5 సంవత్సరాల పిల్లల కోసం సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రజలు పరిశుభ్రత పాటించడం, మరుగుదొడ్లు వినియోగించడం, చేతులు సబ్బుతో కడుక్కోవడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ , ఎమ్మెల్ హెచ్ పి రాధిక హెచ్ వి నర్సింగ్ ఆఫీసర్, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి







-స్వయం ఉపాధి రంగాలపై మహిళలు దృష్టి పెట్టాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-రాజేశ్వర్ రావు కాలనీలో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే -27

మహిళా సంఘాల సభ్యులు తమ గ్రామాల్లో నిర్మిస్తున్న నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, సమాజంలో జరిగే అన్ని అంశాలపై చర్చించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర గ్రామైఖ్య సంఘం సభ్యుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశాలు నిర్వహించినప్పుడు సమాజంలో జరిగే అన్ని విషయాలపై చర్చించి, ఒకరికొకరు తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. తద్వారా అందరూ సమాజంలో జరుగుతున్న విషయాలపై కొంత మేరకు అవగాహన కలిగి ఉంటారని అన్నారు. గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా మన జిల్లాలో ఇప్పటివరకు 113 భవనాలు నిర్మించడానికి అనుమతులు మంజూరు చేశామని, ఇప్పటివరకు 103 భవనాలు గ్రౌండింగ్ పూర్తి చేసి వివిధ దశల్లో నిర్మాణ పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొట్టమొదటగా రాజేశ్వర్ రావు కాలనీలో మహిళా శక్తి భవనం పూర్తి స్థాయిలో నిర్మించబడి, అందుబాటులోకి వచ్చిందని అన్నారు. తక్కువ సమయంలోనే భవనాన్ని నిర్మించినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలు అంటే కేవలం రుణాలు తీసుకోవడం, చెల్లించడం వరకు మాత్రమే పరిమితం కావద్దని, ప్రతీ విషయం సభ్యులు అవగాహన కలిగి ఉండాలని, స్వయం ఉపాధి రంగాల వైపు దృష్టి పెట్టి ఆర్థికంగా ఎదిగేందుకు స్థిరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతీ సమావేశానికి మండల స్థాయి అధికారులను ఆహ్వానించి వారు అందించే సలహాలను స్వీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు అండగా నిలిచిన సర్పంచ్, యువజన సంఘం

ఇల్లంతకుంట, మే 27 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన కీర్తి భారతి అనారోగ్యంతో మృతి చెందగా, సొంత ఇల్లు లేక అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు. హృదయ విదారక దృశ్యాన్ని చూసి చలించిన స్థానిక యువజన సంఘ సభ్యులు వెంటనే స్పందించారు. మృతదేహాన్ని వీధిలో ఉంచడం ఇష్టం లేక యువజన సంఘ భవనాన్ని తెరిచారు. రాత్రికి రాత్రే ఫ్రీజర్ తెప్పించి మృతదేహాన్ని భద్రపరిచారు. యువకులు రాత్రంతా అక్కడే ఉండి ఏర్పాట్లు చూసుకున్నారు. ఉదయం బంధువులు, స్థానికులు కడసారి చూపు చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. మృతురాలి చెల్లెలు, చెల్లెలు కొడుకు దేవరాజు సహాయంతో తెల్లవారు జామున అంత్యక్రియలు పూర్తి చేశారు, విషయం తెలుసుకున్న సర్పంచ్ మామిడి రాజు వెంటనే స్పందించి యువజన సంఘ అధ్యక్షుడు రేగుల కార్తీక్, సభ్యులతో మాట్లాడి ఏర్పాట్లు చేయించారు. దహన సంస్కరణ నిమిత్తం సర్పంచ్ మామిడి రాజు రూ. 10,000, ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ రూ. 5,116 ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. గ్రామంలో నిరుపేదలకు ఆపత్కాలంలో యువజన భవనాన్ని వినియోగించుకోవచ్చని సర్పంచ్ తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు చేరాల వంశీకృష్ణ, అంతటి శ్రీకాంత్, యువజన సంఘ సభ్యుల సేవలను గ్రామస్థులు అభినందించారు.

# ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తేనే నాయకుడు అవుతాడు

-రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 27



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోడె రమేష్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గరిపెల్లి ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే నాయకుడు దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి అంకితమైన దృక్పథం క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావం కలిగిన వ్యక్తిత్వం బలమైన నిర్ణయాలు తీసుకుని మార్పు తీసుకువచ్చే శక్తి చూపిన మార్గంలో నడుచుకుంటూ, ప్రజల కోసం కృషి చేయాలి. ఇది కేవలం గౌరవం మాత్రమే కాదు ఒక బాధ్యత, ఒక కర్తవ్యంగా ప్రతి కార్యకర్త తీసుకోవాలి అన్నారు సేవ, నమ్మకం, అభివృద్ధి ఇదే బీజేపీ సిద్ధాంతమన్నారు ఈ సమావేశం ప్రధానంగా బూత్ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణలో సమన్వయం పెంచడం కోసం ఏర్పాటు చేయబడుతుంది ప్రతి బూత్‌లో పార్టీకి ఉన్న బలహీనతలు, బలాలను గుర్తించడం ఓటర్ల జాబితాను పరిశీలించి, తప్పులు సవరించడం కొత్త ఓటర్ల నమోదు పై దృష్టి పెట్టడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం పెంపొందించడం సమావేశంలో బూత్ వారీగా ఓటర్ల వివరాలు గత ఎన్నికల విశ్లేషణ సోషల్ మీడియా వినియోగం ద్వారా ప్రచారం చెయ్యడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల తప్పులను ప్రజల్లో బహిర్గతం చేయాలని ప్రతి కార్యకర్త తన బూత్‌లో కనీసం 20-30 కుటుంబాలను సంప్రదించాలి కొత్త ఓటర్లను నమోదు చేయించాలి పార్టీపై నమ్మకం పెంచే విధంగా ప్రజలతో మాట్లాడాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను , విజయాలను ప్రజలకు వివరించాలి సమావేశంలో మండల అధ్యక్షులు రమేశ్ మాట్లాడుతూ ప్రతి నాయకుడు కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, వచ్చే ఎన్నికల్లో విజయాన్ని సాధించడానికి పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రతి కార్యకర్త ఈసమావేశంలో చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ నాయకులు నర్సింలు గణేష్ రెడ్డి జమున బండ దేవయ్య పత్తి స్వామి సర్వోత్తమ్ నాగరాజుగౌడ్ దేవేందర్ గౌడ్ రవీందర్ స్వామి సత్యం శ్రీనివాస్ చారి నర్సింలు మధు పూల్య నాయక్ మల్లేష్ గౌడ్ దేవేందర్ యాదవ్ శ్రీనివాస్ చంద్రం యాదవ్ రాజేష్ చారి నరేష్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా వివోఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

-బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వర రావు..

మే 27 ఖమ్మం తెలంగాణ పత్రిక



రాష్ట్రవ్యాప్తంగా వివోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి, వారికి కనీస వేతనాన్ని అమలు చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ దీపికలు తల్లాడలో చేపట్టిన దీక్షకు బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ దీపికలకు కనీస వేతనం 20వేలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. గత కొన్ని రోజులుగా గ్రామ దీపికలు దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారిని గుర్తించి 20వేల వేతనాన్ని ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉధృతంగా ఆందోళనలు చేస్తామని ఆయన ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చల్లనాగులు, ప్రధాన కార్యదర్శి కార్యదర్శులు రాయల రమేష్, పెరిక కిరణ్, మండల ట్రెజరీ యద్దనపూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఉద్దగిరి రామారావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు వేమా అశోక్, యువమోర్చా నాయకులు కటికి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్ల పేరిట మోసం.. వ్యక్తి అరెస్ట్

ఇల్లంతకుంట, మే 27 తెలంగాణ పత్రిక

కార్ల అమ్మకం, కొనుగోలు పేరిట మోసం చేసిన గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన ఉత్తం రఘును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇల్లంతకుంటకు చెందిన దయ్యాల కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రఘు నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు రూ. 6.10 లక్షలకు బేరం చేసి, టీవీఎస్ ఫైనాన్స్‌లో రూ. 5.40 లక్షల రుణం తీసుకుని రూ.4 లక్షలు నిందితుడికి చెల్లించాడు. రఘు మహీంద్రా ఫైనాన్స్ రుణం కట్టకుండా, ఫైనాన్స్ పేరుతో కారు తీసుకెళ్లి వేరొకరికి అమ్మేశాడు. అలాగే కిషోర్ మరో స్విఫ్ట్ కారును రూ. 5 లక్షలకు మాట్లాడి రూ. 1.90 లక్షలే ఇచ్చి కారు తీసుకెళ్లి మోసం చేశాడు. ఎస్సై సిరిసిల్ల అశోక్ విచారణ జరిపి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) మే 27



అప్పుల బాధతో ఓ రైతు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్న శంకరంపేట మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన బోయిన రాజయ్య తన కున్న కొద్ది పొలంలో బోర్ వేశారు పంటలు దిగుబడిదాకా హైదరాబాదుకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ ఉన్న ముగ్గురు పిల్లలను నడుపుతుండేవాడు. హైదరాబాదు నుండి ఇంటికి వచ్చి అప్పుల బాధలు ఉన్నాయని తన భార్యతో చెప్పి మనస్థాపానికి గురై బుధవారం ఓ గదిలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు మృతునికి భార్య ఎల్లవ్వ ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బోయిని మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శివానందం కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# తడిచిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

-రుద్రారం లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) మే 27

అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మెదక్ ఆర్డిఓ రమాదేవి అన్నారు. బుధవారం చిన్న శంకరంపేట మండలం లో ని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని లారీలను కూడా పంపిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. వీరితోపాటు తహసిల్దార్ మాలతీ, సర్పంచ్ ఆకుల సంతోషి నవీన్, తోపాటు తదితరులున్నారు.

# తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్

(తెలంగాణ పత్రిక) మే 27



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వివిధ గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కు తడిసిన ధాన్యాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ పరిశీలించారు రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎవరు కూడా దిగులు చెందాల్సిన అవసరం లేదని రాజకీయాలు పక్కన పెట్టి రైతులకు మనోధైర్యాన్ని కల్పించాలని.. రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో రైతులు పండించిన పంటను తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ధైర్యం కల్పించారు ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతుందని గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట అయిన 24 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ కావడం జరుగుతుందని తెలిపారు

# వడదెబ్బతో వ్యక్తి మృతి

శంకరపట్నం మే 27 (తెలంగాణ పత్రిక)



శంకరపట్నం మండలం గూడాటి పల్లె గ్రామంకు చెందిన సింగిరెడ్డి కిషన్ రెడ్డి ఎండ తీవ్రతకు గురై వడదెబ్బ కారణంగా అకాల మరణం చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. కిషన్ రెడ్డి పట్ల గ్రామ ప్రజలు, స్నేహితులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## హాఫీజ్ పేట్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఎలెక్ట్ అయిన నూతన కమిటీ ప్రారంభం

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి మే 27.



హఫీజ్‌పేట్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నూతన కమిటీ సభ్యులు బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. హఫీజ్‌పేట్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నూతన కమిటీ సభ్యులు మే 27న హఫీజ్‌పేట్లోని వారి నివాసంలో బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీ బోయిని అనూష మహేష్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణం మరియు ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలపై చర్చించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరగా, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనవంతు సహకారం అందిస్తానని మహేష్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారు వంశీ, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జాయింట్ సెక్రటరీ బి.రాజు, ఖజాంచి ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవరాజ్‌తో పాటు కమ్యూనిటీ సభ్యులు శ్రీదేవి, ప్రమీల, లావణ్య, అనిల్, వెంకటేష్, కృష్ణ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కమిటీ సభ్యులంతా సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## ధాన్యంకొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

-కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి సంబంధిత అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ ద్వారా వెహికల్స్ సంఖ్యను పెంచాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు , జొన్న కొనుగోళ్ల కోసం అవసరమైన వెహికల్స్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఇంకా జొన్న కొనుగోలు ప్రక్రియ పూర్తి కాని కేంద్రాలలో వెంటనే ప్రక్రియ పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న టాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సీఎంఆర్ కొరకు ఏర్పాటు చేసిన వాహనాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మక్కలను త్వరగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించిన జగిత్యాల శాసనసభ్యులు

మే 27, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రాయికల్ యువజన మార్కెట్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తొందరగా మక్కలను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ రైతులతో మాట్లాడినా ఎమ్మెల్యే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తుందని మొత్తం మక్కాలను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని మొత్తం మక్కాలను కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ,మండల నాయకులు అధికారులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల అభివృద్ధికి శాఖల మధ్య సమన్వయం కీలకం







-జిల్లా కలెక్టర్ అంకిత్
-గిరిజన ప్రాంతాల అభివృద్ధి అధికారుల బాధ్యత.
-భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు
-గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి.
-పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 27

జిల్లాలోని భద్రాచల, పినపాక నియోజకవర్గాలలో నెలకొన్న అటవీ, రెవెన్యూ భూ సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ అటవీ అనుమతులపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన భద్రాచలం ఐ టీ డి ఏ నందు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట రావు , పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు , జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, ఐటిడిఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం, పినపాక నియోజకవర్గాలలో వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ అనుమతులు, భూసేకరణ, డీఎల్సీ అనుమతులు, పోడు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ, రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అటవీ అనుమతులు, భూసేకరణ, డీఎల్సీ అనుమతులు వంటి అంశాలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలోని సమస్యలను ప్రతినెల సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో రహదారులు, విద్యుత్, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాల పనులు ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, మండల సమాఖ్య భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, డీఎల్సీ అనుమతులకు సంబంధించిన పెండింగ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు . భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ చర్ల, దుమ్ముగూడెం మండలాలలో రహదారులు, విద్యుత్, త్రాగునీరు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని అన్నారు . అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయడంతో పాటు వెదురు మొక్కలు అందించి వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి వారికి రహదారులు విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించడానికి ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో ఐటిడిఏ పరిధిలో సుమారు రూ. 28.39 కోట్ల అభివృద్ధి పనులు, పంచాయతీరాజ్ శాఖలో రూ. 6.50 కోట్ల పనులు, ఆర్ అండ్ బి శాఖ పరిధిలో సుమారు రూ. 67 కోట్ల అభివృద్ధి పనులు అటవీ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ, క్రీడా స్థలాలు, మండల సమాఖ్య భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పోడు పట్టాలు పొందిన రైతులకు బోర్‌వెల్ అనుమతులు కూడా ఇవ్వాలని కోరుతూ, గిరిజనుల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 58 శాతం అటవీ ప్రాంతం ఉన్నందున, ప్రతి అభివృద్ధి పనిలో అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి అయినవి అని,సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. అటవీ భూములను పరిరక్షిస్తూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు . ఇలాంటి సమన్వయ సమావేశాలు ప్రతి నెల నిర్వహించడం ద్వారా సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. అటవీ శాఖ ద్వారా



ఇవ్వవలసిన అనుమతులు చట్ట ప్రకారం త్వరితగతిన లభించేలా అటవీ సంపద వన్య ప్రాణుల సంరక్షణ చేస్తూ పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. ఐటిడిఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారానికే ఈ సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి వారం నిర్వహిస్తున్న గిరిజన దర్బార్‌కు పోడు సమస్యలపై అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారని చెప్పారు. పోడు పట్టాల్లో పేర్ల పొరపాట్లు, పాస్‌బుక్స్ అందకపోవడం, డీఎల్సీ అనుమతులు వచ్చినా పట్టాలు జారీ కాకపోవడం, సర్వే జరగని రైతులు, బోర్‌వెల్ విద్యుత్ లైన్ అనుమతులు పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. అర్హులైన గిరిజనులకు మాత్రమే పోడు పట్టాలు అందేలా, పదేళ్లకు పైగా సాగు చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోడు రైతులకు బోర్‌వెల్, విద్యుత్ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరిన ఆయన, ఇప్పటివరకు 1076 దరఖాస్తులను అటవీ శాఖకు పంపగా 254 మందికి అనుమతులు లభించాయని తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, జిల్లాలో 31 అభివృద్ధి పనులకు సంబంధించి విద్యుత్ శాఖ ఫామ్-ఏ సమర్పించిన వెంటనే అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని సూచించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి ఇంజనీరింగ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, అటవీ, ఐటీడీఏ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

రంగారెడ్డి జిల్లా,శేరిలింగంపల్లి మే 27,(తెలంగాణ పత్రిక )

మియాపూర్ పరిధిలోని దీప్తి శ్రీనగర్‌కు ఆనుకుని ఉన్న రాగులకుంట చెరువు పైభాగంలోని 101 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఆరు అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతోందని ఎంసీపీఐ(యు) సహాయ కార్యదర్శి పల్లె మురళి ఆరోపించారు. సంబంధిత భూమికి చట్టబద్ధమైన యాజమాన్య పత్రాలు లేవని, నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా అనుమతులు పొందినట్లు ఆయన తెలిపారు. దీప్తి శ్రీనగర్ ఆమోదిత లేఔట్‌లో ఈ స్థలం ప్రభుత్వ భూమిగా స్పష్టంగా నమోదై ఉందని, ఇందుకు సంబంధించిన లేఔట్ ప్రతులను అధికారులకు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అనధికార నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజా ఆస్తులు, చెరువు పరిసరాలు మరియు ప్రజా ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జీహెచ్ఎంసీ మియాపూర్ సర్కిల్ 48, డిప్యూటీ కమిషనర్ శేషిరేఖ, ఏసీపీ టౌన్ ప్లానింగ్ ఐ





రాణి, కి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. అలాగే శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ మహిపాల్ రెడ్డిని కలిసి సమస్యను వివరించినట్లు చెప్పారు. అక్రమ నిర్మాణాలు, నకిలీ పత్రాల ఆధారంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించే ప్రయత్నాలపై పూర్తి వివరాలు అందజేయగా, అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణమే స్థల పరిశీలన నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

-ఈ సందర్భంగా అధికారులు వెంటనే స్పందించి:

అక్రమ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని, అనధికార భవనాన్ని కూల్చివేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించా లని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు ప్రతులను హైడ్రా కమిషనర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, శేరిలింగంపల్లి ఎంఆర్వో, శేరిలింగంపల్లి జోన్ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు కూడా పంపినట్లు తెలిపారు..

# దుర్గమ్మ సేవలో .. ఎమ్మెల్యే దంపతులు

పాపన్నపేట, మే 27: (తెలంగాణ పత్రిక)

పాపన్నపేట మండలం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాతను ఎమ్మెల్యే రోహిత్ రావు,శివాని దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు అమ్మవారి కృపతో అందరూ ఆయురా రోగ్యాలతో సంతోషంగా ఉండాలని వారు కోరుకున్నారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు .. భరత్ గౌడ్,ప్రసాద్ గౌడ్, ఖలీమ్, ఇంద్రాసేనా రెడ్డి తదితరులు



పాల్గొన్నారు.

# బిజినెస్

## మార్కెట్ రేసులో దూసుకుపోతున్న అదానీ పవర్!



భారత స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్‌నకు చెందిన ‘అదానీ పవర్’ సరికొత్త మైలురాయిని అందుకుంది. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌ను వెనక్కి నెట్టి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ముందుకు దూసుకెళ్లింది. ఈ ఏడాది ఇప్పటివరకు షేర్ల ధర ఏకంగా 68 శాతం మేర పెరగడంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అదానీ పవర్ ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.

**దేశంలో 11వ స్థానానికి**

నేటి ట్రేడింగ్‌లో అదానీ పవర్ షేరు దాదాపు 3 శాతం లాభపడి రూ.252 వద్ద సరికొత్త 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. ఈ భారీ పెరుగుదలతో కంపెనీ మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.4.85 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.4.72 లక్షల కోట్ల వద్దే నిలిచిపోయింది. దీంతో దేశంలోనే అత్యంత విలువైన కంపెనీల జాబితాలో అదానీ పవర్ 11వ స్థానానికి ఎగబాకింది.

**ఎల్‌నినో ఎఫెక్ట్**

దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు అదానీ పవర్ షేర్లకు కలిసొచ్చాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల తీవ్రమైన ఎండలు ముదరడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. మే 22 నాటి గణాంకాల ప్రకారం.. ప్రపంచంలోని అత్యధిక ఉష్ణోగ్రత్తలు నమోదైన 100 నగరాల్లో 97 భారతదేశంలోనే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో విద్యుత్ కంపెనీల షేర్లకు స్టాక్ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

# డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత



భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో కీలక స్థానానికి చేరుకుంటోంది. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా.. మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నేడు విడుదల చేసిన తాజా నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పు పై కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ.. “ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయి” అని వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా భారత్ పటిష్ఠమైన స్థితిలో ఉందని, బలమైన డిమాండ్, విస్తరిస్తున్న డెవలప్‌మెంట్ పైప్‌లైన్, బహుళ నగరాల పర్యావరణ వ్యవస్థ దీనికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు.

**గ్లోబల్ డేటా సెంటర్ మార్కెట్‌లో హైదరాబాద్‌కు 9వ ర్యాంక్**

భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలుస్తోంది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. ఇక హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు కూడా ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది. భారతదేశ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు కూడా ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10.5 గిగావాట్లకు పైగా సామర్థ్యం ఇంకా భూమి దశలోనే ఉందని, ఇది రాబోయే రోజుల్లో భారీ అభివృద్ధికి సంకేతమని నివేదిక పేర్కొంది.

# చెస్ టోర్నీలో గుకేశ్‌కు వింత అనుభవం.. వైరల్‌గా మారిన ‘వాటర్ బాటిల్’ వీడియో!



- నార్వే చెస్‌లో గుకేశ్ బాటిల్ వీడియో వైరల్
- వెస్లీ చేతిలో ఓడిన భారత గ్రాండ్‌మాస్టర్
- 116 ఎత్తుల సుదీర్ఘ పోరు డ్రాగా ముగింపు
- ఆర్మగెడాన్ రౌండ్‌లో వెస్లీ సో ఘన విజయం
- గాయంతోనూ ప్రజ్ఞానందపై గెలిచిన అలిరెజా ఫిరౌజా

నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్‌కు వింత, సరదా అనుభవం ఎదురైంది. వెస్లీ సోతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ మధ్యలో గుకేశ్ వాటర్ బాటిల్ క్యాప్ తీయడానికి పడ్డ తిప్పలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆటలో తీవ్రంగా ఆలోచిస్తూ పక్కనే ఉన్న బాటిల్ మూత తీయడానికి ప్రయత్నించి అది రాకపోవడంతో అతడు బిక్కమొహం వేసిన విజువల్స్ నెటిజన్లను నవ్విస్తున్నాయి.

**చేజారిన విజయం**

క్లాసికల్ రౌండ్-2 మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు వెస్లీ సోపై గుకేశ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఏకంగా 116 ఎత్తుల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ పోరులో గుకేశ్ విజయం సాధించేలా కనిపించాడు. అయితే వెస్లీ అద్భుతంగా డిఫెన్స్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించగలిగాడు. తర్వాత ఫలితం కోసం నిర్వహించిన ‘ఆర్మగెడాన్’ (టై బ్రేకర్) మ్యాచ్‌లో వెస్లీ పైచేయి సాధించి 1.5 పాయింట్లు ఖాతాలో వేసుకోగా, గుకేశ్ కేవలం ఒక పాయింట్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**వెస్లీ వివాదాస్పద వ్యాఖ్యలు**

సుదీర్ఘ పోరాటం తర్వాత ఓటమి పాలవడంతో గుకేశ్ తీవ్ర నిరాశకు గురయ్యాడు. మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన అసంతృప్తిని దాచుకోలేకపోయాడు. దీనికి తోడు వెస్లీ మాట్లాడుతూ.. గుకేశ్ ప్రస్తుత రేటింగ్ అతడి అసలు ప్రతిభకు అద్దం పట్టడం లేదంటూ కాస్త వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు ఈ ఓటమి మానసికంగా కాస్త నిరాశ కలిగించింది.

**గాయంతోనూ గెలిచిన ఫిరౌజా**

టోర్నీలోని ఇతర మ్యాచ్‌ల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. అలిరెజా ఫిరౌజా చీలమండ గాయంతో బాధపడుతూ, చేతికర్రల సాయంతో నడుస్తూనే భారత ఆటగాడు ప్రజ్ఞానందపై ఘన విజయం సాధించి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సైతం జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ చేతిలో ఓడిపోయే ప్రమాదం నుంచి తప్పించుకుని, ఆర్మగెడాన్ రౌండ్‌లో ఈ టోర్నీలో తన మొదటి విజయాన్ని నమోదు చేశాడు.

# స్పోర్ట్స్

## ధోనీ భవిష్యత్తు పై సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ కీలక ప్రకటన!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాల పై సీఎస్కే జట్టు సీఈవో కాశీవిశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. “ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది” అని సీఈవో వెల్లడించారు. ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ పత్రిక

GENERAL NEWS

# ఇలా అయిపోయాడేంటి... 'లుంగి డ్యాన్స్' సింగర్ హనీ సింగ్ కు ఏమైంది

- తన మానసిక ఆరోగ్య సమస్యలపై మాట్లాడిన సింగర్ హనీ సింగ్
- బైపోలార్ డిజార్డర్ కారణంగా ఏడేళ్లు గదికే పరిమితమయ్యానని వెల్లడి
- తాను చనిపోయానని, నరకంలో ఉన్నానని భ్రమపడినట్లు వ్యాఖ్య
- మందుల వల్ల 105 కిలోల బరువు పెరిగి బట్టతల వచ్చిందన్న సింగర్
- ప్రస్తుతం కోలుకుంటున్నానని, ఇది విగ్గేనని ఓపెన్‌గా వెల్లడి




లుంగి డ్యాన్స్ సాంగ్ తో దేశవ్యాప్త పాప్యులారిటీ సంపాదించుకున్న ప్రముఖ సింగర్, ర్యాపర్ హనీ సింగ్ తన మానసిక ఆరోగ్య సమస్యలపై సంచలన విషయాలు వెల్లడించారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన కెరీర్ ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడే బైపోలార్ డిజార్డర్‌తో తీవ్రంగా ఇబ్బంది పడ్డానని తెలిపారు. ఈ కారణంగా ఏకంగా ఏడేళ్ల పాటు ఇంటికే పరిమితమై, పూర్తి ఏకాంత జీవితం గడిపినట్లు చెప్పారు. షారుఖ్ ఖాన్‌తో కలిసి అంతర్జాతీయ పర్యటనలో ఉన్నప్పుడు, ముంబైలో ఓ మ్యూజిక్ రియాలిటీ షో చేస్తున్న సమయంలో తనలో ఈ లక్షణాలు మొదలయ్యాయని హనీ సింగ్ వివరించారు. స్టేజ్‌పైనే చనిపోతానేమోనన్న తీవ్రమైన భయం, ఆందోళన తనను వెంటాడేవన్నారు. ఒకానొక దశలో చికాగోలో ప్రదర్శన ఇవ్వకుండా ఉండేందుకు తన తలను సగం షేవ్ చేసుకున్నానని, మరో షోలో రెండు పాటలు పాడి మధ్యలోనే వదిలేశానని గుర్తుచేసుకున్నారు. తరువాత ఏడేళ్ల పాటు అభిమానులకు, స్నేహితులకు దూరంగా ఇంట్లోనే ఉండిపోయానని చెప్పారు. ఫోన్, టీవీ, ఇంటర్‌నెట్ వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉన్నానన్నారు. సుమారు మూడేళ్ల పాటు తన గది దాటి బయటకు రాలేదని, మరణ భయంతో బాత్రూమ్ తలుపు కూడా తెరిచే ఉంచుకునేవాడినని తెలిపారు. 2018-19 సమయంలో తాను అప్పటికే చనిపోయానని, స్వర్గానికి, నరకానికి మధ్య చిక్కుకుపోయానని భ్రమపడ్డానని చెప్పి ఆశ్చర్యపరిచారు. ఏడేళ్ల పాటు వాడిన మందుల కారణంగా తన శరీర బరువు 105 కిలోలకు పెరిగిందని, జుట్టు పూర్తిగా ఊడిపోయి బట్టతల వచ్చిందని హనీ సింగ్ వెల్లడించారు. "ఇది నకిలీ జుట్టు, నాకు పూర్తిగా బట్టతల ఉంది. ఇది విగ్గు" అని ఇంటర్వ్యూలోనే ఓపెన్‌గా చూపించారు. డాక్టర్‌ను మార్చాక, కొత్త మందులు మొదలుపెట్టిన నాలుగు వారాల్లోనే మార్పు కనిపించిందని, అదే తన పునరాగమనానికి సహాయపడిందని అన్నారు. ఈ అనుభవం తనకు 30 ఏళ్ల వయసులోనే ఎదురవ్వడం మంచిదైందని భావిస్తున్నట్లు హనీ సింగ్ పేర్కొన్నారు.

## తెలుగు చిత్రపరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉంది: దిల్ రాజు ఆసక్తికర వ్యాఖ్య




ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమ చాలా బ్యాడ్ షేప్‌లో ఉందనే మాట చెప్పడానికి తాను భయపడనని వ్యాఖ్యానించారు. ఈ మాట చెప్పడానికి చాలామంది భయపడతారని అన్నారు. కానీ తాను ధైర్యంగా చెప్పగలనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించడం పెద్ద సవాల్ అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' వంటి చిత్రాలను తీయడం ద్వారా ప్రేక్షకులను థియేటర్‌కు తీసుకురావాలని వ్యాఖ్యానించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే మంచి సినిమాలు నిలబడతాయని అన్నారు. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్త దర్శకులంతా మంచి చిత్రాలను తీసి పరిశ్రమను నిలబెట్టాలని అన్నారు. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే పరిశ్రమ అంత బాగుంటుందని అన్నారు. ఈ చిత్రం ఈవెంట్ చాలా బాగా నిర్వహించారని, ఇందుకు నిర్మాతలను అభినందిస్తున్నానని అన్నారు. ఇటీవలి కాలంలో థియేటర్‌లలో సందడి కనిపించడం లేదని, ఈ చిత్రం ద్వారా థియేటర్‌లో సందడి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు.

## ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక భాషలో మాట్లాడటానికే ప్రయత్నిస్తా: శ్రీలీల



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయం లోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్ తో పాటు ఇతర పరిశ్రమల్లో నూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఐ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

## రామ్ చరణ్ కష్టం చూడకుండా విమర్శలా?.. ట్రోలింగ్ పై జగపతి బాబు ఫైర్!





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల నడుమ జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో చిత్ర బృందం చురుగ్గా పాల్గొంటోంది. ఈ క్రమంలో రామ్ చరణ్ ప్రవర్తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ పై సీనియర్ నటుడు జగపతి బాబు తీవ్రంగా స్పందించారు. పనిలేని వాళ్లే ఇలాంటి విమర్శలు చేస్తుంటారని, హీరోల కష్టాన్ని గుర్తించాలని ఆయన హితవు పలికారు. 'పెద్ది' సినిమా ప్రమోషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న రామ్ చరణ్, కొన్ని ఈవెంట్లలో కొందరి పేర్లు మర్చిపోవడం, బెంగళూరులో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై సోషల్ మీడియాలో కొందరు ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విమర్శలపై తాజాగా మీడియాతో మాట్లాడిన జగపతి బాబు, వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "ట్రోలింగ్ చేసే వాళ్లను నేను పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవరినైనా కిందికి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటివి చేస్తుంటారు. ఈ సినిమా కోసం చరణ్ ఎంత కష్టపడ్డాడో, ఎన్ని గాయాలపాలయ్యాడో ఎవరూ చూడరు. ఇలాంటి చిన్న విషయాలను పట్టుకుని పెద్దవిగా చేయడం సరికాదు" అని అన్నారు. ఒక పెద్ద సినిమా విడుదల సమయంలో హీరోలపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఒకేసారి ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం చాలా సహజం. నేను కూడా ఎన్నోసార్లు మర్చిపోతాను. వాటిని పట్టుకుని రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనపై కూడా ఇలాంటి ఫేక్ ప్రచారం జరిగిందని జగపతి బాబు గుర్తుచేసుకున్నారు. "ఒక సీన్ కోసం నేను 70-80 టేకులు తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అందులో ఎలాంటి వాస్తవం లేదు. నేను మహా అయితే మూడు టేకులు తీసుకుని ఉంటాను. పూర్తిగా అవాస్తవాలతో నాపై కూడా ట్రోలింగ్ చేశారు" అని తన అనుభవాన్ని పంచుకున్నారు. కాగా, స్పోర్ట్స్ డ్రామాగా రానున్న 'పెద్ది' చిత్రంలో జగపతి బాబు 'అప్పలసూరి' అనే కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. సినిమాపై అంచనాలు భారీగా ఉండటంతో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని మరింత పెంచింది.

## 'పుష్ప' అవకాశం నాకూ షాకే.. ఆ పాత్ర నా జీవితాన్నే మార్చేసింది: సునీల్

కమెడియన్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సునీల్, 'పుష్ప' చిత్రంలో మంగళం శ్రీను పాత్రకు ఎంపికవడం తనకూ ఓ షాక్ అని అన్నారు. ఈ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని, అన్ని భాషల్లోనూ అవకాశాలు తెచ్చిపెట్టిందని ఆయన తెలిపారు. తన తాజా మలయాళ చిత్రం 'కాటాలన్' తెలుగు వెర్షన్ ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సునీల్ ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'పుష్ప'లో విలన్‌గా సుకుమార్ మిమ్మల్ని ఎలా ఊహించుకున్నారని అడగ్గా.. "లాక్‌డౌన్ సమయంలో నేను కామెడీ పాత్రలు కాకుండా వేరేవి చేస్తున్నానని సుకుమార్‌కు చెప్పాను. రెండు రోజులకే ఆయన ఫోన్ చేసి 'పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ పాత్ర ఉంది, కానీ కామెడీ చేయకూడదు, శరీరం కూడా కదపకుండా హావభావాలు పలికించాలని చెప్పారు," అని సునీల్ వివరించారు. లుక్ టెస్ట్ కోసం పంపిన కాస్ట్యూమ్స్‌తో రకరకాలుగా ఫోటోలు తీసి పంపించానని, అవి నచ్చడంతో ఆ పాత్రకు ఎంపికయ్యానని గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు పాత్ర కోసం నుదుటిపై షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. సునీల్ 'మారి' అనే కీలక పాత్రలో నటించిన 'కాటాలన్' చిత్రం మే 28న తెలుగులో విడుదల కానుంది. ఏనుగు దంతాల అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకుడు. ఇందులో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.




Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143